# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. సమాజంలోని అన్ని వర్గాలకు పాఠశాల విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.

2. **రాబోయే ఐదేళ్లలో విద్యుత్ రంగంలో రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని, 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**

3. **భారతదేశ సర్వతోముఖాభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ పని చేస్తోందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా స్పష్టంచేశారు.**

4. **రాబోయే నాలుగేళ్లలో తెలంగాణాను దేశానికే ప్రగతి నమూనాగా మారుస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

5. **ఈ శతాబ్దం విద్యార్థులదేనని, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు.**

6. **ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠ్యాంశాలకు రూపకల్పన చేస్తామని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.**

==========================

సమాజంలోని అన్ని వర్గాలకు పాఠశాల విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. దేశంలో కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి స్పందించారు. ఈ నూతన విద్యాలయాల ఏర్పాటుతో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని, అదేవిధంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అన్ని వర్గాలకు విద్య అందుబాటులో ఉండాలనే జాతీయ విద్యా విధానం లక్ష్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు.

--------------------------

దేశ, రాష్ట్ర భవిష్యత్తు విద్యుత్‌పైనే ఆధారపడి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. కేంద్ర ఇంధన శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్..ఈఈఎస్ఎల్ సంయుక్తంగా

నిన్న కృష్ణాజిల్లా పోరంకిలో నిర్వహించిన ఊర్జావీర్ కార్యక్రమాన్ని కేంద్ర ఇంధనశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో కలిసి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో పరిశోధనల కోసమే ప్రత్యేకంగా ఓ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని.. సౌర, పవన, హరిత ఇంధనం సహా అన్ని అనుబంధ అంశాలను దాని పరిధిలోకి తెస్తామని వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో విద్యుత్ రంగంలో రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని, 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చంద్రబాబునాయుడు వివరిస్తూ...

వాయిస్ (33 సెకన్లు)

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ మాట్లాడుతూ.. ఊర్జావీర్ పథకం కింద నాణ్యమైన ఉపకరణాలను ఇవ్వడంతో పాటు లక్షల మందికి ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కరెంటు బిల్లుల భారం తగ్గుతుందని.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టే కార్యక్రమాల్లో ఊర్జావీర్ ఒకటి అని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ (30 సెకన్లు)

---

భారతదేశ సర్వతోముఖాభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ పని చేస్తోందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిన్న జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. వికసిత భారత్ సాధించడమే ఎన్.డి.ఎ. ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఒక లక్ష్యం లేకుండా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆ పార్టీ అసత్యాలతో పాలన చేస్తోందని నడ్డా పేర్కొంటూ..

...వాయిస్.. 28 సెకన్లు

---

రాబోయే నాలుగేళ్లలో దేశానికే ప్రగతి నమూనాగా తెలంగాణాను మారుస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నిన్న పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ఆయన గంధంవారిగూడెంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవాల బహిరంగసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాష్ట్రంలోనూ మొదటి ఏడాదిలో 55 వేల ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వమే లేదని స్పష్టంచేశారు. రైతులు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, సంక్రాంతి తర్వాత రైతు భరోసా సొమ్ము వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

---

ఈ శతాబ్దం విద్యార్థులదే అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. వైఎస్ఆర్ జిల్లా కడప పురపాలక ఉన్నత పాఠశాలలో నిన్న నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాయలసీమ అంటేనే

చదువుల నేల అని, ఈ ప్రాంతంలో అత్యధికంగా గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు. చదువు కేవలం ఉద్యోగం, ఆర్థిక స్థోమతను పెంపొందించుకోవడానికి మాత్రమే కాదని.. జ్ఞాన సముపార్జన కోసమని గుర్తించాలని పవన్ కల్యాణ్ వివరిస్తూ..

...వాయిస్.. 28 సెకన్లు

---------------------------

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠ్యాంశాలకు రూపకల్పన చేస్తామని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విశాఖపట్నంలో నిన్న జరిగిన ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ, ప్రస్తుత విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క విద్యాలయాన్నైనా అంతర్జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలపాలని ముఖ్యమంత్రి తనకు లక్ష్యంగా నిర్దేశించారని తెలిపారు. పరిశ్రమలు, విద్యా సంస్థలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కృషిచేస్తామని మంత్రి లోకేశ్ తెలియజేస్తూ..

....వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

క్షయ వ్యాధి రహిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు. హర్యానా రాష్ట్రంలోని పంచకుల నగరం నుంచి దేశ వ్యాప్తంగా వంద రోజుల పాటు జరిగే క్షయ వ్యాధి నిర్మూలనా ప్రచార కార్యక్రమాన్ని నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025 సంవత్సరం నాటికి దేశాన్ని క్షయ వ్యాధి రహిత దేశంగా మార్చడంలో ఈ కార్యక్రమం ఒక మైలు రాయిగా నిలుస్తుందని తెలిపారు. క్షయ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం వ్యూహం మార్చిందని, ఈ వ్యాధిని సమగ్రంగా నిర్మూలించడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఆయుష్మాన్ భారత్– ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ప్రయోజనాలను పొందుతున్నారని నడ్డా తెలిపారు.

======================